క్లుప్తంగా

తీగలపై పడిన వృక్షం.. తప్పిన ప్రమాదం

సంగారెడ్డి క్రైమ్: సంగారెడ్డిలోని బైపాస్‌లో ఉన్న ఎంపీడీవో కార్యాలయం పక్కన ఉన్న క్వార్టర్స్‌లో అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి భారీ నీలగిరి చెట్టు పక్కనే ఉన్న విద్యుత్ తీగలపై పడింది. దీంతో ఉదయం నుంచి విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు వృక్షాన్ని పూర్తిగా తొలగించి విద్యుత్ తీగాలను సరిచేశారు.

సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు



మునిపల్లి(అందోల్): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో చేరేందుకు 5, 6వ తేదీలలో సంగారెడ్డిలో స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అర్చన తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఎస్సీ-4, ఎస్టీ-1, బీకాం జనరల్‌లో ఎస్సీ-14, బీకాం హానర్స్‌లో ఎస్సీ-22, ఎస్టీ-2 బీకాం. బీఏలో, ఎస్సీ-22, ఎస్టీ-1 బీబీఏలో ఎస్సీ-4, గ్రూపుల్లో మిగిలిన సీట్లను భర్తీ చేయడానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు 5, 6తేదీలలో ఉదయం 9.30 గంటలకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సుధాకర్‌రెడ్డి



మంత్రికి స్వీటు తినిపిస్తున్న సుధాకర్‌రెడ్డి

మునిపల్లి(అందోల్): మండల కేంద్రమైన మునిపల్లికి చెందిన మంతూర్ సుధాకర్‌రెడ్డి రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపికైనట్లు మాజీ ఎంపీపీ రాంరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సంగారెడ్డిలోని మంత్రి దామోదరకు బుధవారం సుధాకర్‌రెడ్డి స్వీట్లు తినిపించారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్నట్లు సుధాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

రూరల్ ఎస్సై వినయ్ కుమార్



మాట్లాడుతున్న రూరల్ ఎస్సై వినయ్

సంగారెడ్డి టౌన్: సైబర్ నేరస్తులపై అప్రమత్తతో ఉండాలని సంగారెడ్డి రూరల్ ఎస్సై వినయ్ కుమార్ అన్నారు. బుధవారం సంగారెడ్డి మండలం ఇస్మాయిల్ ఖాన్‌పేటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు, మహిళలు ఆన్‌లైన్‌లో లోన్ యాప్లను వాడకూడదని, అపరిచితులతో వీడియో కాల్, మొబైల్ చాటింగ్ చేయకూడదని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే వాటితో అప్రమత్తంగా ఉండాలని సోషల్ మీడియాతో ఎటువంటి సమస్యలు వచ్చిన పోలీసులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ టౌన్: సైబర్ నేరాలపై విద్యార్థులు, యువత పూర్తి అవగాహన కలిగి ఉండాలని టౌన్ ఎస్ఐ కాశీనాథ్ అన్నారు. పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎస్ఐ మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఫోన్‌లో వచ్చే మేసేజ్‌లకు స్పందించరాదన్నారు. ఆన్‌లైన్ మోసాల గురించి ఇరుగు పొరుగు వారిని చైతన్య పరచాలని యువతను కోరారు.సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930. 100 నంబర్లకు డయల్ చేయాలన్నారు.

పొంగిపొర్లుతున్న వాగులు



పొంగిపొర్లుతున్న మామిడి వాగు

న్యాల్‌కల్(జహీరాబాద్): నాలుగు రోజులుగా మండలంలో కురుస్తున్న వానల వల్ల వాగులు పొంగి పొర్లుతున్నాయి. రేజింతల్, బసంత్‌పూర్ వాగులు పొంగిపొర్లడంతో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలు, వాహన చోదుకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం కురిసిన వర్షానికి బసంత్‌పూర్ గ్రామ సమీపంలో గల చాకలి వాగు పొంగి పొర్లడంతో రాజోల, బసంత్‌పూర్, మెటల్‌కుంట, రాజోల తదితర గ్రామాలకు చాలా సేపు రాకపోకలు నిలిచిపోయాయి. మినుము, పత్తి తదితర పంటలు కూడా నీట మునిగాయి. నష్టపోయిన తమకు పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వలస కుటుంబాలకు మౌలిక వసతులు

- కలెక్టర్ వల్లూరు క్రాంతి
- బొల్లారం, కాజిపల్లిలో పర్యటన
- బొల్లారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



కాలనీ వాసులతో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

పటాన్‌చెరు టౌన్: కాజిపల్లిలోని వలస కుటుంబాల కాలనీలో మౌలిక వసతులు మెరుగుకు కృషి చేస్తామని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. బుధవారం ఆమె బొల్లారం, కాజిపల్లి గ్రామాలలో పర్యటించారు. వలస కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో పాఠశాల నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశారు. అనంతరం అంగన్‌వాడీ పాఠశాలను తనిఖీ చేశారు. జిన్నారం మండలంలో తాగునీటి ఎద్దడికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బొల్లారం మున్సిపల్ పరిధిలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని చెప్పారు. అక్కడి నుంచి బొల్లారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించి ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం కలిగించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. సమయపాలన పాటించాలని, వర్షాల కారణంగా వైరల్ ఫీవర్, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. బొల్లారంలో బీఎల్వోలు సర్వే చేస్తున్న ఓటరు జాబితా ఎస్ఎస్ఆర్ పరిశీలనలో భాగంగా కలెక్టర్ ఇంటింటికి తిరిగి ఓటర్ల జాబితా సర్వే పరిశీలించారు. అనంతరం గ్రామ శివారులోని మాధవానికుంట చెరువును పరిశీలించారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ భూములు, చెరువులను కాపాడుకోవాలని అన్నారు .గ్రామంలోని రెసిడెన్షియల్ పాఠశాలలో ఎస్ఎస్ఆర్ ఫండ్స్ కింద అవసరమైన మరమ్మతు పనులు మౌలిక వస్తువులు కల్పనకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ ,పరిశ్రమల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ గాయత్రీదేవి, తహసీల్దార్ భిక్షపతి, మునిసిపల్ చైర్మన్ రోజా, బొల్లారం మున్సిపల్ కమిషనర్ మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణ కోసం పోరాటాలు

- ఎస్ఎఫ్ఐ మాజీ అధక్షుడు మాణిక్యం



మాట్లాడుతున్న మాణిక్యం

సంగారెడ్డి ఎడ్యుకేషన్: విద్యారంగ పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ నిరంతర పోరాటాలు చేస్తుందని సంఘం జిల్లా మాజీ అధక్షుడు మాణిక్యం తెలిపారు. సంగారెడ్డిలోని కేవల్‌కిషన్ భవన్‌లో రెండు రోజుల పాటు విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ విద్యారంగ పరిరక్షణ కోసం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలతో పాటు అందరికీ విద్య, అందరికీ ఉపాధి సాధన కోసం ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యారంగానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో 10 శాతం రాష్ట్ర బడ్జెట్లో 30 శాతం నిధులు కేటాయించాలని ఉన్నా తగ్గిస్తూ వేస్తున్నారని ఆరోపించారు. విద్య పట్ల ప్రభుత్వాలు వివక్షత చూపిస్తూ ప్రైవేటు కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తున్నాయని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ మాట్లాడుతూ విద్యార్థులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ వాణి జిల్లా ఉపాధ్యక్షులు హరీష్ జిల్లా కమిటీ సభ్యులు విష్ణువర్ధన్, అర్జున్, స్వప్న , ప్రశాంత్ నాయకులు పావని తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గణేశ్ ఉత్సవాలు చేపట్టాలి

- సీఐ సుధీర్ కుమార్



మాట్లాడుతున్న సీఐ సుధీర్ కుమార్

హత్నూర(సంగారెడ్డి): ప్రశాంతమైన వాతావరణంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని జిన్నారం సీఐ సుధీర్ కుమార్ అన్నారు. బుధవారం హత్నూర మండలం దౌల్తాబాద్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాలులో వినాయక చవితి ఉత్సవాలు సందర్భంగా శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క యువజన సంఘాల నాయకులు ఉత్సవ సభ్యులు ఒక్కరినొకరు పరస్పర సహకారాలు అందిపుచ్చుకోవాలని పేర్కొన్నారు. నిమజ్జనం రోజున చెరువు కుంటల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముందస్తుగానే విద్యుత్ దీపాలు అమర్చుకోవాలని నిర్వాహకులకు సూచించారు. డీజేలు వాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై సుభాష్ ,డిప్యూటీ తహసీల్దార్ దావూద్ అహ్మద్, ఎంపిడివో శంకర్, విద్యుత్ అధికారి ఏఈ విజయ్ కుమార్, ఇరిగేషన్ అధికారి వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేటలో..

సదాశివపేట(సంగారెడ్డి): పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ మహేష్‌గౌడ్ అన్నారు. బుధవారం వినాయక మండపాల నిర్వాహకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండ విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఆంజనేయులు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్దన్న పాల్గొన్నారు.

విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్

- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి
- సర్కారు బడుల్లో కంప్యూటర్ తరగతులు ప్రారంభం



కంప్యూటర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: విద్యార్థులపైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలల్లో బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వార్థం వదిలితేనే మార్పు, అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రతీ దానికీ ప్రభుత్వంపై ఆధారపడకుండా శ్రమదానంతో చిన్న చిన్న పనులు చేసుకోవడం విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రోగాం మేనేజర్ సూర్య, ఇతర బాధ్యులు ఫణి సింహాద్రి, వంశీ, అమూల్యరెడ్డి, అభిలాష్, కార్తీక్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ శంకర్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్ పాటిల్, పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనీస వేతనం మంజూరు చేసి ఆదుకోవాలి

మునిపల్లి(అందోల్): గ్రామాలలో విద్యుత్ మీటర్లకు బిల్లులు కొట్టే వారిని రెగ్యులర్‌చేసి కనీస వేతనం రూ.30వేలు మంజూరు చేసి ఆదుకోవాలని విద్యుత్ బిల్లులు కొట్టే రాములు సంబంధిత అధికారులను కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సుమారు 15 సంవత్సరాలుగా ఆయా గ్రామాల్లో బిల్లులు కొడుతున్నామని, ఒక మీటర్‌కు రెండు రూపాయల చొప్పున ఇస్తే ప్రస్తుత పరిస్థితుల్లో ఎలా సరిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులను ఎన్నిసార్లు కోరినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

సంగారెడ్డి జోన్: ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలోని ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో మధ్యాహ్నం 1:30 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

గీతంలో ఘనంగా ఫ్రెషర్స్ డే

పటాన్‌చెరు: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రుద్రారం ప్రాంగణంలో ఫ్రెషర్స్ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, సైన్స్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, హ్యూమానిటీస్‌లో 2024- 25 విద్యా సంవత్సరంలో కొత్తగా చేరిన విద్యార్థుల కోసం సీనియర్ విద్యార్థులు దీనిని ఏర్పాటు చేశారు. ర్యాంప్‌వాక్, నృత్య ప్రదర్శన, జానపద ట్యూన్‌లు, బాలీవుడ్ హిట్లతో కూడిన పాటలు, వినోదాత్మక స్కిట్లు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి.

7 నుంచి బ్రహ్మోత్సవాలు

పటాన్‌చెరు: ప్రసిద్ధి చెందిన రుద్రారం గణేష్ గడ్డ సిద్ధి గణపతి దేవాలయం నవరాత్రి ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 7వ తేదీ నుంచి 17 వరకు వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు ఉంటాయని తెలిపారు.

నిలిచిన నీళ్లు.. రైతుల ఆందోళన



మన్‌సాన్‌పల్లి శివారులో పత్తి పంటలో నిలిచిన నీరు

మునిపల్లి(అందోల్): ఇటీవల పడిన వర్షాల కారణంగా పత్తి పంటలో నీళ్ల నిలిచిపోవడంతో పత్తి పంట మొల్క, కాయలు నీటిలో తడిసి పాడైపోతున్నాయని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పంట నష్టపరిహారం మంజూరు చేయాలని కోరుతున్నారు.

బోధనేతర పనులు లేకుండా చూడాలి

- యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి



సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు బోధనేతర పనులు లేకుండా చూడాలని, రెసిడెన్షియల్ పాఠశాలల ఉపాధ్యాయులకు పని ఒత్తిడి తగ్గించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. బుధవారం టీఎస్ యూటీఎఫ్ సంగారెడ్డి మండల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సంగారెడ్డిలోని బాలికల పాఠశాల, కొత్లాపూర్, కలబ్‌గూరు, పోతిరెడ్డిపల్లి పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు బోధనేతర పనులు ఎక్కువ కావడం వల్ల బోధన సమయం తగ్గుతుందన్నారు. అలాగే.. రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పనిభారం తగ్గించాలని, నైట్ స్టడీ అవర్ కోసం కేర్ టేకర్స్ నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సైమన్, ఆర్.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- అధికారులకు ఆర్డీఓ రాజు ఆదేశం



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ రాజు

సదాశివపేట(సంగారెడ్డి): భారీ వర్షాల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సంగారెడ్డి ఆర్డీఓ రాజు ఆదేశించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాల నేపథ్యంలో పట్టణ, మండల పరిధిలో కూలిన గృహాలు, కుంటలు, చెరువుల పరిస్థితి వరదలు, పంటనష్టం, ఓటరు జాబితా, ధరణి సమస్యల గురంచి తహసీల్దార్ సరస్వతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అయన మాట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండాలని అదేశించారు.

మెరుగైన సేవలు అందించాలి



ఆస్పత్రి పర్యవేక్షకుడికి వినతి పత్రం అందజేస్తున్న ఫోరం నాయకులు

సంగారెడ్డి: జిల్లా కేంద్రంలోని సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి ఆధ్వర్యంలో ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ అనిల్ కుమార్కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఫోరం అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర మాట్లాడు తూ ప్ర భుత్వ ఆసుపత్రి బోధన ఆసుపత్రిగా మారడం వల్ల ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరిగిందని, దాంతో మెరుగైన సేవ లు అందించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దివ్యాంగులకు వృద్ధులకు ప్రత్యేక ఓపీ కౌంటర్లు ఏర్పాటు చేయాలని, గర్భిణీలకు మెరుగైన శస్త్ర చికిత్స విధానాన్ని అ మలు చేయాలని డిమాండ్ చేశారు. కా ర్యక్రమంలో ఫోరం సహ కార్యదర్శి శ్రీ కాంత్, కార్యవర్గ సభ్యులు సాయి, వరాల రాజు, మార్కుండేయ, పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నల్లవాగును కబ్జాపై చర్యలు తీసుకోవాలి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: నల్లవాగును కబ్జా చేసిన వెంచర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సంగారెడ్డిలో ఆర్డీఓ రాజుకు వినతి పత్రం అందజేశారు. సదాశివపేట మండలం నాగుసాన్‌పల్లి, పెద్దాపూర్ గ్రామ శివారులో నల్లవాగును కబ్జా చేసిన వెంచర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని 65వ జాతీయ రహదారికి ఆనుకుని నల్లవాగు పరివాహక ప్రాంతం ఉందని, దీంట్లో ఈ వెంచర్ యాజమాన్యం ప్లాట్లు చేసి విక్రయిస్తుందని ఆరోపించారు.

◆ మట్టి విగ్రహాలను పూజిద్దాం

సంగారెడ్డి టౌన్: వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయాలని డీఎస్పీ సత్యయ్య గౌడ్ అన్నారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో హెల్పింగ్ హాండ్స్ యూత్ ఆధ్వర్యంలో మట్టి గణపతిని అందజేశారు. మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని రక్షించాలన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ ఉపాధ్యక్షుడు అఖిల్, సభ్యులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

◆ దరఖాస్తుల స్వీకరణ

మునిపల్లి(అందోల్): రుణమాఫీ జాబితాలో ఉన్న రైతులంతా వ్యవసాయ విస్తరణ అధికారులు రెహమాన్, లావణ్య, స్నేహకు తమ దరఖాస్తు ఫారాలను అందజేశారు. మండల కేంద్రమైన మునిపల్లి రైతువేదికలో బుధవారం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఇంకా ఎవరైనా అందజేయని వారుంటే త్వరిత గతిన అందజేయాలని అధికారులు కోరారు.

◆ మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 10 మంది వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు రూ.2వేల చొప్పున జరిమానా విధించారు. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం, మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 10మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

◆ కూలిన నివాసాల పరిశీలన



నారాయణఖేడ్: భారీ వర్షాలతో ఇళ్లకూలిన బాధితులకు తక్షణ సాయం కింద రూ.50 వేల ఆర్థిక సాయంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుచేసి ఆదుకోవాలని ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఖేడ్ మండలం నమ్లిమెట్‌కు చెందిన వెంకటేశం, వీరయ్యల కూలిన ఇళ్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయనవెంట బీఆర్ఎస్ నాయకులు లక్ష్మారెడ్డి, లింగమేష్, యాదయ్య, సాయిలు, నాగయ్య ఉన్నారు.

◆ గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం నల్లవాగు గురుకులంలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు 6న ఉదయం 11 గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ తిరుపతయ్య బుధవారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీలో సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

డీకే అరుణను కలిసిన వక్ఫ్ భూ బాధితులు



వినతి పత్రం అందజేస్తున్న రైతులు

జహీరాబాద్: తాతాల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూములను వక్ఫ్ బోర్డుకిందకు చేర్చి తమను ఇబ్బందుల పాలు చేస్తున్నారని రైతులు ఎంపీ డీకే అరుణకు విన్నవించారు. బుధవారం జహీరాబాద్, కోహీర్ మండలానికి చెందిన రైతులు అరుణను కలిసి వినతి పత్రం అందజేశారు. వక్ఫ్‌బోర్డు చట్టంలో కేంద్ర ప్రభుత్వం సవరణలు చేస్తున్నందున తమ భూములను వక్ఫ్ నుంచి తప్పించి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. జాయింట్ పార్లమెంట్ కమిటీ(జేపీసీ)ని జహీరాబాద్‌కు రప్పించి క్షేత్ర పర్యటన జరిపి వాస్తవాలు తెలుసుకునేలా చూడాలని విన్నవించారు. ఒక్క జహీరాబాద్ డివిజన్ పరిధిలోనే సుమారు 13వేల ఎకరాలను వక్ఫ్ బోర్డు కింద చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ రైతుల అభిప్రాయాలు, వాస్తవ పరిస్థితులను ఈ నెల 6వ తేదీన ఢిల్లీలో జరగనున్న జేపీసీ సమావేశంలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

రుణమాఫీకాని రైతుల గుర్తింపు



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏడీఏ

కంగ్టి(నారాయణఖేడ్): రుణమాఫీ జాబితాలో పేరులేని రైతుల వివరాలు నమోదు చేసుకుంటున్నట్లు ఏడీఏ నూతన్‌కుమార్ తెలిపారు. మండలంలోని తుర్కవడ్‌గాం గ్రామంలో బుధవారం రైతు కుటుంబాల వివరాలు నమోదు చేసుకొని ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వెంకటేశ్, ఏఈఓ షరీఫ్, పీఏసీఎస్ చైర్మెన్ మారుతిరెడ్డి, పంచాయతీ సెక్రటరీ దేవయ్య, పడాల సంగారెడ్డి, బస్సీ తదితరులు పాల్గొన్నారు.

అధిక వర్షాలతో వాడిపోతున్న పత్తిపంట



పత్తి పంటను చూపుతున్న రైతు

కంగ్టి(నారాయణఖేడ్): వర్షాలతో పంటపొలాల్లో నిలిచిన నీటితో పత్తి పంటలు వాడిపోతున్నాయి. ఈ వర్షాకాలపు సీజన్‌లో అంతంతగా కురిసిన వర్షానికి పత్తి పంటకు రైతులు రసాయన ఎరువులు వేసి ఏపుగా పెంచారు. మండలంలోని దామర్‌గిద్దా, బాన్సువాడ, నాగన్‌పల్లి తదితర శివార్లలో దాదాపు 40 శాతం మొక్కలు వాడిపోతున్నట్లు రైతులు తెలిపారు.